క్లుప్తంగా

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి


పెద్దశంకరంపేట విజయడెయిరీ వద్ద మిల్క్ ఏజెంట్ల ఆందోళన

పెద్దశంకరంపేట(మెదక్): విజయడెయిరీ మిల్క్ ఏజెంట్లకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ గ్రామీణ ప్రాంత ఏజెంట్లు స్థానిక విజయ డెయిరీ సెంటర్ వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని మండలాల్లో ఏజెంట్లకు బిల్లులు చెల్లించారన్నారు, తమ మండలంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బిల్లులు చెల్లించడం లేదని, దీనితో తాము తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నామన్నారు. జిల్లా అధికారులు స్పందించడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి తమ సమస్యను పరిష్కరిస్తూ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. ఆయా గ్రామాల ఏజెంట్లు ఉన్నారు.

పది పరీక్షలకు సిద్ధం కావాలి


రాంపూర్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం పద్మారెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల హెచ్‌ఎం పద్మారెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఇంటి వద్ద సమయాన్ని సద్వినియోగం చేసుకొని చదివేలా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపైన ఉందన్నారు. పదో తరగతి విద్యార్థుల ఉన్నత చదువులు, విద్యా ప్రమాణాల పెంపుదలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ ఇందిర, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి, షాదుల్లా విద్యార్థులతో తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత


మహేందర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

పాపన్నపేట(మెదక్): ఇటీవల గుండెపోటుతో మరణించిన తలారి మహేందర్ కుటుంబానికి అతని ఆత్మీయ మిత్రులు ఆర్థిక చేయూతను అందించిన సంఘటన మండలంలోని నాగ్సాన్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న తలారి మహేందర్ (39) ఈ నెల 11న గుండెపోటుతో మరణించారు. అతనికి భార్య భాగ్య, ఇద్దరు కొడుకులు సృజన్, కౌశిక్ ఉన్నారు. అతని అకాల మరణంతో తీవ్ర ఆవేదనకు లోనైన అతని చిన్ననాటి స్నేహితులు తలా కొంత నగదు జమచేసి, బాధిత కుటుంబానికి రూ.70 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, శ్యాం, అనిల్, రాకేష్, విఠల్, భరత్ ఉన్నారు.

26వ రోజుకు చేరిన రిలే దీక్షలు


నర్సాపూర్‌లో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న ఆయా పార్టీల నాయకులు

నర్సాపూర్: ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 26వ రోజుకు చేరాయి. శనివారం పట్టణంలోని 15వ వార్డుకు చెందిన నాయకులతో పాటు ఆయా పార్టీల నాయకులు, రైతు సంఘం నాయకులు దీక్షలో పాల్గొనగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. అనంతరం మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. డంప్ యార్డు ఎత్తి వేసేందుకు అఖిల పక్షం నాయకులు చేపట్టిన ఉద్యమానికి కాంగ్రెస్ నాయకులు కలిసి రావాలని కోరారు. దీక్షలో పంబాల భిక్షపతి, రాజేందర్, మైసయ్య, చంద్రశేఖర్, సర్వేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోరికలు తీర్చే నల్లపోచమ్మ

- 17 నుంచి 20 వరకు జరగనున్న ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): భక్తులు కోరిన కోరికలు తీర్చే దైవం నల్లపోచమ్మ. మండలంలోని తునికి గ్రామంలోని నల్లపోచమ్మ దేవి ఆలయం మెదక్ జిల్లాలోనే వందేళ్ల చరిత్ర కలిగింది. ఏడుపాయల వనదుర్గాదేవి ఆలయం తర్వాత అత్యంత ప్రసిద్ధి చెందిన కోవెలగా దినదినాభివృద్ధి చెందుతోంది.

బండ్ల ప్రదర్శన ప్రత్యేకత

నల్లపోచమ్మదేవి ఆలయంలో బండ్ల ప్రదర్శనకు ప్రత్యేకత ఉంది. ఎక్కువ దూరం నుంచి వచ్చిన భక్తులు బండ్లు ముందుంటాయి. దగ్గరి ప్రాంతం వారివి చివర ఉంటాయి. దూరం నుంచి మొక్కలు తీర్చుకునేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థ గతంలో నుంచి పాటిస్తున్న సాంప్రదాయాన్ని నేటికి పాటిస్తున్నారు. గతంలో వందకుపైగా బండ్లను ఊరేగించేవారు. ప్రస్తుతం ఎడ్లబండ్ల సంఖ్య తగ్గినా.. అద్దెకు తీసుకొచ్చి మరి తిప్పుతూ మొక్కులు తీర్చుకుంటున్నారు.

ఈనెల 17 నుంచి జాతర

తునికి నల్లపోచమ్మదేవి జాతర ఈనెల 17 తేదీ నుంచి 20 వరకు జరుగుతాయి. 17న ధ్వజారోహణం, 18న అగ్నిగుండాలు, బోనాలు, 19న బండ్ల ఊరేగింపు, 20న పాచిబండ్ల ప్రదర్శన జరుగనుంది. వివిధ జిల్లాల నుంచి భక్తులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో రానున్నారు. జాతర ఏర్పాట్లు సైతం ముమ్మరం చేశారు.


తునికిలోని నల్లపోచమ్మదేవి ఆలయం


ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



జాతర ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. నీటి వసతి కోసం రెండు ట్యాంక్‌లు ఉండగా అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తాం. టాయిలెట్స్, మరుగుదొడ్లు ఉన్నాయి.

– రంగారావు ఈఓ, తునికి

మాదిగలను మోసం చేస్తున్న ప్రభుత్వం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

మెదక్ మున్సిపాలిటీ: మాదిగలను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో జిల్లా కేంద్రంలో రిలే దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం రెండో రోజు మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు యాదగిరి, జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు అస్తగల్ల బాలరాజు, అధ్యక్షుడు వెన్నెల సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఏర్పుల పరమేశ్, ప్రభాకర్, భిక్షపతి, భాస్కర్ నాయకులు శంకర్ మాదిగ, సీనియర్ నాయకులు కొమ్ముశేఖులు, సామేలు, ప్రభాకర్, దేవేందర్, సంపత్ కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.


మెదక్‌లో రిలే దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పరిశ్రమతో కలుషితమవుతున్న నీరు


వడియారం అపోలో పరిశ్రమ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చేగుంట(తూప్రాన్): గ్రామ శివారులోని పరిశ్రమతో నీరు కలుషితమై పంటలు నష్టపోతున్నామని వడియారం గ్రామ రైతులు శనివారం అపోలో పైపుల పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామ శివారులోని అపోలో పైపుల పరిశ్రమతో భూగర్భ జలాలు కలుషితమై రంగు మారిపోయాయన్నారు. కలుషితమైన నీటితో పంటలు పండక నష్టపోతున్నామని పరిశ్రమ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు ధర్నా నిర్వహించగా సోమవారం పరిశ్రమ యజమానులతో మాట్లాడి, రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు.

తప్పిపోయిన మహిళ


బాల మల్లవ్వ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని భగీరథపల్లిలో జరిగిన బీరప్ప జాతరకు వచ్చిన మహిళ తప్పిపోయిందని కుటుంబ సభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు ఇచ్చారు. మండలంలోని రజాక్‌పల్లి గ్రామానికి చెందిన బాలమల్లవ్వ(54) ఈ నెల 13న భగీరథపల్లిలోని బీరప్ప జాతరకు వచ్చి తప్పిపోయింది. బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు కుమారుడు శ్రీరామ్ తెలిపారు. తెలుపురంగులో 5.5 ఎత్తు ఉన్న ఆమె నలుపు, గోధుమ, పింక్ కలర్ చీర, పింక్ కలర్ జాకెట్ ధరించి ఉందన్నారు. ఎక్కడైనా కన్పిస్తే 8498951189 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ఉన్నత పాఠశాలలో ఆదివారం సందిని రమేశ్ గాంధీ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు.

షీ టీంపై విద్యార్థులకు అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో శనివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో షీ టీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, డయల్ 100, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, మద్యపాన నిషేధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలను భయాందోళనకు గురిచేసినా, వేధించినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, 181కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు దేవిదాస్, రవి, స్వరూప, గంగారాణితో పాటు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీం సభ్యురాలు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు శనివారం గ్రామానికి చెందిన యువజన నాయకుడు శ్రీనివాస్‌గుప్తా పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాజిద్‌అలి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్‌లు జగన్, ఏసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆలోచించేలా బోధన చేయాలి

రాష్ట్ర పరిశీలకుడు మంగారెడ్డి

మనోహరాబాద్ (తూప్రాన్): విద్యార్థులు స్వతహాగా ఆలోచించి నైపుణ్యం పెంచుకునేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ టీం సభ్యుడు మంగారెడ్డి సూచించారు. ఈ మేరకు కాళ్లకల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా అంశాలు, రికార్డులను పరిశీలించారు. తరగతిగదిలో వెనకబడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు చేపట్టాల్సిన బోధన, కార్యాచరణ ప్రణాళిక గురించి రివ్యూ మీటింగ్‌లో వివరించారు. విద్యార్థులతో చర్చ పద్ధతిలో బోధన చేసి, విద్యార్థులను అనేక అంశాలపై ఆలోచింపజేసేలా బోధన ఉండాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనలు పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందజేశారు.


ఉపాధ్యాయుల రివ్యూ మీటింగ్‌లో సూచనలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు మంగారెడ్డి

ఎస్సీకాలనీలో తాగునీటి ఎద్దడి


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో తాగు నీటి ఎద్దడి నెలకొంది. రక్షిత వాటర్ ట్యాంకు నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోయారు. నీటి సమస్య పరిష్కరించాలని శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు.

ప్రార్థనకు టీచర్లు డుమ్మా

17 మంది టీచర్లకు ఆరుగురు హాజరు

శివ్వంపేట(నర్సాపూర్): సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించాల్సిన పలువురు టీచర్లు అవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమైనప్పటికీ పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. శివ్వంపేట ఉన్నత పాఠశాలలో 17 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నప్పటికీ శనివారం ఉదయం 7.50 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రార్థనలో కేవలం 6 మంది టీచర్లు మాత్రమే హాజరయ్యారు. ఈ విషయం గురించి హెచ్‌ఎం బాలచంద్రం వివరణ కోరగా.. ఒంటిపూట బడి మొదటి రోజు కావడంతో పలువురు ఉపాధ్యాయులు ప్రార్థనకు హాజరు కాలేకపోయారని ఇకముందు ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


శనివారం శివ్వంపేట ఉన్నత పాఠశాల ప్రార్థనకు హాజరైన ఉపాధ్యాయులు

చెక్కు అందజేత

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డీసీఆర్బీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చేనేశ్వరీ డెలివరి సమయంలో ఆస్పత్రిలో మరణించింది. ఆమె భర్త కు రూ.3,78,160 పోలీసు భద్రత నుంచి ఎక్స్ గ్రేషియా చెక్కుతోపాటు వారి ఇద్దరు పిల్లలకు రూ.4,00,000 విలువ గల భద్రత ఎక్స్ గ్రేషియా చెక్కులను శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆమె భర్తకు అందజేశారు.


చెక్కు అందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించండి

17, 18 తేదీల్లో ధర్నాలు

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17, 18 తేదిల్లో కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి శనివారం యూనియన్ ఆధ్వర్యంలో సీడీపీఓకు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం నర్సమ్మ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ధర్నా చేస్తామన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్స్ అందరూ, అన్ని ప్రాజెక్టుల్లోని టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు సమ్మెలో పాల్గొనాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఏఐ శిక్షణ తరగతులతో మేలు

హెచ్‌ఎం ఓంప్రకాష్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు ఏఐ కంప్యూటర్ తరగతులతో ఎంతో మేలు జరుగుతుందని కౌడిపల్లి ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ (లో ఫిమేల్ లిట్రసి)హెచ్‌ఎం ఓంప్రకాష్ అన్నారు. శనివారం పాఠశాలలో ఏఐ(ఆర్టిఫిషల్ ఇంటలిజెన్సీ) కంప్యూటర్ విద్యను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3, 4, 5 తరగతుకు చెందిన విద్యార్థులకు కంప్యూటర్‌తో విద్య నేర్పుతున్నామన్నారు. చదువులో వెనకబడిన వారిని గుర్తించి కంప్యూటర్ ఆధారంగా విద్య నేర్పించడంతో ఉత్సాహంగా నేర్చుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాజిద్‌అలి, ఉపాధ్యాయులు ప్రియలక్ష్మి, సునీత, మహేశ్, నర్సింలు, అశ్విని, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) బోధన విధానాన్ని పాఠశాల హెచ్‌ఎం సాగరిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో పోటీపడేలా నూతన విద్య విధానం ఏఐ టెక్నాలజీతో సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ హేమలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లం, మన్మథ, జాకియా, రాజశేఖర్, రాజయ్య, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


కౌడిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏఐ కంప్యూటర్ విద్యను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

శివ్వంపేట(నర్సాపూర్): ఏఐ కంప్యూటర్ ఆధారిత చదువు వెనకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నగొట్టిముక్ల, చండీ ప్రాథమిక పాఠశాలల్లో (ఎఫ్‌ఎల్‌ఎన్‌ఏఐ)లో భాగంగా కంప్యూటర్ ఆధారిత బోధన తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులో వెనకబడిన విద్యార్థుల కోసం కంప్యూటర్ ఆధారిత బోధన ద్వారా సులువుగా నేర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్, ఇందుమతి, సురేశ్, పుష్ప, ఉపాధ్యాయులు స్వాతి, దయానందరెడ్డి, గ్రామస్తులు భిక్షపతిరావు, నారాయణరావు, నర్సింగరావు, నరేందర్, తదితరులు ఉన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్లలో ఏఐ బోధన ప్రారంభిస్తున్న ఎంఈఓ బుచ్చనాయక్

కృత్రిమ మేధతో బోధన మెరుగు పర్చాలి

కొల్చారం(నర్సాపూర్): కృత్రిమ మేధతో బోధన మెరుగు పర్చాలని ఎంఈఓ సత్యనారాయణ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఎనగండ్ల, కొల్చారం ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధ ల్యాబ్‌లను ఎంఈఓ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధను ఉపయోగించి బోధన ను మెరుగుపరచడానికి మొదటి దశలో పైలెట్ ప్రాజెక్టుగా ఆరు జిల్లాల్లో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబికా సోని, భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పోతులబోగూడ గ్రామానికి చెందిన భిక్షపతి, పాంబండకు చెందిన గుమ్ముల శేఖర్ మృతిచెందారు. దీంతో శనివారం బాధిత కుటుంబాలను మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా పరామర్శించి రూ.10 వేల చొప్పున నగదు, నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌గౌడ్, పెంటగౌడ్, శ్రీకాంత్, మైసయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

◆ 19న నార్సింగి తైబజార్ వేలం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి గ్రామపంచాయతీ ఆవరణలో ఈ నెల 19న తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ నాగభూషణం తెలిపారు. గ్రామ ప్రత్యేక అధికారి ఆనంద్ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించనున్నట్లు వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరం కోసం నిర్వహించే వేలం పాటలో పాల్గొనేవారు రూ.50 వేల ముందుగా డిపాజిట్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. బుధవారం నిర్వహించే ఈ వేలం పాటకు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

◆ పేట తహశీల్దార్ బదిలీ

పెద్దశంకరంపేట(మెదక్): మండల తహసీల్దార్ గ్రేస్‌బాయి బదిలీ అయ్యారు. రెండేళ్లుగా ఇక్కడ పనిచేసిన ఆమెను శనివారం జిల్లా కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

◆ కోళ్లదాన అక్రమంగా నిల్వ చేసిన వారిపై కేసు నమోదు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో కోళ్లదాన అక్రమంగా నిల్వ చేసిన వారిపై కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు శనివారం రామాయంపేట మండలానికి చెందిన స్నేహ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అనుమల రాజశేఖర్‌రెడ్డికి చెందిన కోళ్లదానను రాష్ట్రవ్యాప్తంగా కోళ్లఫారాలకు చిన్న పిల్లలు ఆరోగ్యంగా పెరగడానికి కోళ్లదాన పంపిణీ చేశారు. ఈ దానను మండల కేంద్రంలోని వర్షిని టేడర్స్‌లో అక్రమంగా కోళ్లఫారాల నుంచి తీసుకోని నిల్వ చేశారని తెలిపారు. ఈ మేరకు తమకు సంబంధించిన దానను సంచులు 136 వర్షిని టేడర్స్ వద్ద ఉండటంతో అతనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


తామస్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాంధారిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. గాంధారిపల్లికి చెందిన తామస్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కూతుర్ని ఇంటికి తీసుకురావడానికి వెళ్లి కారులో వస్తుండగా.. మంబోజిపల్లి వద్ద ఏడుపాయల నుంచి వెళ్తున్న లంబాడి పాండు అనే వ్యక్తి మద్యం మత్తులో కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తామస్‌రెడ్డికి, ఆయన కూతురుకు గాయాలయ్యాయి. కాగా తామస్‌రెడ్డి చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. అతని కూతురు ప్రమాదం నుంచి బయటపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


జైపాల్

నర్సాపూర్ రూరల్: మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం ఆస్పత్రిలో మృతి చెందాడు. నర్సాపూర్ ఎస్ఐ లింగం, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలంలో మహ్మదాబాద్ గ్రామానికి చెందిన నీరుడి జైపాల్(35) మద్యానికి బానిసై భార్యతో గొడవపడ్డాడు. భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక వద్దకు వెళ్లి అక్కడ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు నర్సాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సౌందర్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ సంగమేశ్వరస్వామికి పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల సంగమేశ్వరస్వామి జాతర సంగర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ శనివారం రాత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవ పూజలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బంగారు భవిష్యత్‌కు చదువుతో బాటలు వేసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.జితేందర్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని సాయిచైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, కరెస్పాండెంట్ గంగాధర్‌గౌడ్, భూమేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.